## క్లుప్తంగా

### రెండు వాహనాల ఢీ..

**కళ్యాణదుర్గం:** పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో నాగుల కట్ట వద్ద రెండు బొలరో వాహనాలు శుక్రవారం సాయంత్రం ఢీ కొన్నాయి. అనంతపురం వైపు నుంచి లగేజీ బొలరో వాహనం బైపాస్‌లో రాయదుర్గం వైపు వెళ్తోంది. అదే సమయంలో పట్టణంలో నుంచి దొడగట్ట వైపు మరో బొలెరో (సీటింగ్) వాహనం బైపాస్‌లో ఢీ కొన్నాయి. ఘటనలో సీటింగ్ బొలరో వాహనం అద్దం ముందు భాగం ధ్వంసమైంది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### మండలస్థాయి వాలీబాల్ పోటీలు

**కుందుర్పి:** మండల స్థాయి అండర్– 17 బాల బాలికల వాలీబాల్ పోటీలు శుక్రవారం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పోటీల్లో మండలం లోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన 12 మంది విద్యార్థులను డివిజన్ స్థాయికి ఎంపిక చేసినట్లు కుందుర్పి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు వీరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ తిప్పేస్వామి, హెచ్ఎం గోపీచంద్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు శివకుమార్, మంజునాథ్, అఖిల్, రేణుక, పద్మావతి, హరీష్, పరమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### దర్గా హోన్నూరు స్వామి దర్గా ప్రారంభం



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు, దర్గా కమిటీ సభ్యులు

**వజ్రకరూరు:** చాబాల గ్రామంలో నూతనంగా నిర్మించిన దర్గా హోన్నూరు స్వామి దర్గా శుక్రవారం ప్రారంభమైంది. తెల్లవారు జామున స్వామిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గా ప్రవేశం చేయించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దర్గాకమిటీ చైర్మన్ శివలింగప్ప, కమిటీ సభ్యులు కరె ధనుంజయ, కరె పరమేష్, సీతారాముడు, నాగరాజు, లింగరాజు, సుధా, వన్నూరు స్వామి, కోటి, కాశీ, వెంకటస్వామి, పక్కీరప్ప, పుల్లయ్య, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

### శుభకార్యం

**కుందుర్పి:** స్థానిక ఫాదర్ ఫెర్రర్ కల్యాణ మంటపంలో శుక్రవారం నిర్వహించిన శుభకార్యానికి మాజీ ఎంపీ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, న్యాయవాది హనుమంతరెడ్డి హాజరయ్యారు. కుందుర్పి వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాధర ఆహ్వానం మేరకు కుమార్తె లక్ష్మీ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం అక్కడే ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అక్రమంగా టపాసులు ఉంచితే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు

**కళ్యాణదుర్గం:** నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమంగా టపాసులు నిల్వ ఉంచితే చర్యలు తప్పవని ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబులు హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం టపాసు విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన దుకాణదారులు పాటించాల్సిన నియమ నిబంధనలు, ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. టపాసు కేంద్రాల వద్ద నీరు, ఇసుక, అగ్నిమాపక సామాగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో టపాసు విక్రయ దారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మెట్టును పరామర్శించిన నాయకులు



మెట్టును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

**కణేకల్లు:** అనారోగ్యం కారణంగా చికిత్స పొంది బెంగళూరులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డిని వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రమణరెడ్డి, పూజారి రామాంజినేయులు, అనిల్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, ఫణీంద్ర, బోర్‌వెల్ ఆనంద్‌రెడ్డిలు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





వజ్రకరూరు నుంచి గుత్తికి వెళ్లే ప్రధాన రహదారి రాళ్లు తేలిన దృశ్యం

## అధ్వానంగా.. ప్రధాన రహదారి

**వజ్రకరూరు:** మండల కేంద్రం నుంచి చింతలాంపల్లి, నాగసముద్రం గ్రామాల మీదుగా గుత్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి రాళ్లు తేలి అధ్వానంగా మారింది. వజ్రకరూరు నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల రోడ్డు తీవ్రంగా దెబ్బతిని రాళ్లు తేలాయి.అక్కడక్కడ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉంది. దీంతో వాహనదారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిని బాగుచేస్తే బళ్లారి నుంచి గుత్తి పట్టణానికి తక్కువ సమయంలోనే రాకపోకలు సాగించడానికి అనుకూలంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరారు.

## పగిలిన తాగునీటి పైప్‌లైన్



పైప్‌లైన్ పగలడంతో ఎగిసిపడుతున్న నీరు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని కణేకల్లు రోడ్డులో విద్యుత్‌శాఖ కార్యాలయ గేటు ముందు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంకు చెందిన పైప్‌లైన్‌కు శుక్రవారం భారీ ఎత్తున లీకేజీ ఏర్పడింది. ఎంఎస్ పైప్‌లైన్ పగలడంతో దాదాపు 20 అడుగుల మేర నీరు పైకి ఎగిసిపడింది. నీరంతా రోడ్డు పాలైంది. విషయం తెలుసుకున్న శ్రీరామిరెడ్డి నీటి పథకం సిబ్బంది ట్యాంకు నుంచి పంపింగ్‌ను నిలిపివేశారు. అనంతరం యుద్ధ ప్రాతిపదికన లీకేజీ మరమ్మతు పనులు చేపట్టారు.

# జర్నలిస్టులపై వేధింపులు ఆపాలి

**రాయదుర్గం:** కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రజాక్షేత్రంలో ఎండగడుతూ, వాస్తవాలను వెలుగులోకి తెస్తున్నందుకే 'సాక్షి' పత్రికపై సీఎం చంద్రబాబు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) మెంబర్ గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు విమర్శించారు. 'సాక్షి' ఎడిటర్ టీ.ధనుంజయరెడ్డి, విలేకరులపై కొనసాగుతున్న కక్షసాధింపు చర్యలకు నిరసనగా శుక్రవారం జర్నలిస్టులు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు, విలేకరులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కూటమి పెద్దల ఆశీస్సులతో ఇన్నాళ్లు గుట్టుగా సాగిన నకిలీ మద్యం మాఫియాను 'సాక్షి' ఆధారాలతో సహ బయటపెట్టినందుకే సాక్షి ఎడిటర్ టీ. ధనుంజయరెడ్డి, విలేకరులపై సిట్ పోలీసులు అక్రమ కేసులు పెట్టి వేధింపులకు దిగారన్నారు. నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐతో ఎందుకు విచారణ జరిపించడం లేదని నిలదీశారు. దేశవ్యాప్తంగా చర్చకు రావడంతో 'సాక్షి'పై అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, లేకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. విద్యార్థి సంఘం నాయకులు ఆంజనేయులు, కొత్రేసీ, శివకుమార్, కౌన్సిలర్లు గోవిందరాజులు, శారద, పక్రుద్దీన్, కో–ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గోల్డ్ ఇస్మహిల్, నిజామ్, రామాంజినేయులు, దివాకర్, రఘురాం, పైతోట ముత్తప్ప, కార్పెంటర్ బాష తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గం: తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



కళ్యాణదుర్గం : డీటీ ఆంజనేయులుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

### సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులను ఎత్తివేయాలి

**కళ్యాణదుర్గం:** రాష్ట్రంలో జరుగుతున్న కల్తీ మద్యం గుట్టును రట్టు చేస్తూ వరుస కథనాలు రాసిన సాక్షి పత్రిక, ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రజా సంఘాలు, జర్నలిస్టులు, వివిధ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సాక్షిపై ప్రభుత్వ కక్ష సాధింపులకు నిరసనగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయ ఆవరణం నుండి ప్లకార్డులతో ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ సాక్షిపై అక్రమ కేసులను ఎత్తివేయాలని...పత్రికా స్వేచ్ఛను కాపాడాలని...సాక్షిపై కూటమి ప్రభుత్వం అక్కసుపై ప్లకార్డులతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఆర్డీఓ కార్యాలయ డీటీ ఆంజనేయులుకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, జి. హనుమంతరాయుడు, నాయకులు యర్రంపల్లి కృష్ణమూర్తి, నరేంద్ర రెడ్డి, తిరుమల వెంకటేశులు, పరమేశ్వరప్ప, గోపారం శ్రీనివాసులు, షేక్షావలి, చరణ్, ఆంజినేయులు, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన 'జీఎస్టీ' వారోత్సవాలు

**కళ్యాణదుర్గం:** స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జీఎస్టీ 2.0 ముగింపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హర్షలత మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా దాదాపు 8 రోజులు విద్యార్థులతో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముగింపు రోజు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ శేషయ్య, అధ్యాపకుడు డాక్టర్ రాధాకృష్ణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కె.శ్రీధర్, శ్యాంప్రసాద్, శైలజ రాణి, జ్యోష్న, షౌకత్ అలీ, రవి శంకర్, ఈశ్వర్‌రెడ్డి, లీలావతి, గణేష్, జేకేసీ మెంటార్ అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

**రాయదుర్గంటౌన్:** జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని డీసీటీఓ సురేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సూపర్ జీఎస్‌టీ– సూపర్ సేవింగ్‌పై స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఆటోడ్రైవర్లు, వాహన యజమానులు, డీలర్లకు అవగాహన కల్పించారు. అంతకుముందు పట్టణంలో జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## నేడు కూడేరుకు కలెక్టర్ రాక

**కూడేరు:** జిల్లా కలెక్టర్ ఆనంద్ శనివారం ఉదయం 10 గంటలకు కూడేరులో పర్యటించనున్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించే స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొంటున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. సైకిల్ ర్యాలీ, మానవహారం, మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందన్నారు. మండల అధికారులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ విచారణ

- వర్కర్‌పై సస్పెన్షన్ వేటు



విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాద్రి

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని కొలిమివీధిలో ఉన్న బీసీ సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై విద్యార్థుల ఆందోళన చేయడంపై అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాద్రి విచారణ చేపట్టారు. శుక్రవారం ఆయన తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హాస్టల్‌లో గురువారం ధర్నా జరిగింది. విద్యార్థులతోనే వంట పనిచేయడం, వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యంపై విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో విచారణకు వచ్చిన అధికారి విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. వర్కర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. వార్డెన్‌ను సైతం హెచ్చరిస్తూ పనితీరు మార్చుకోవాలని హితవు పలికారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు.

## భూసార పరీక్షలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

**ఉరవకొండ:** స్థానిక రేణుమాకుపల్లి రహదారి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భూసార పరీక్షా అధికారి శ్రీనాథ్ రెడ్డి మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్ష, మట్టి ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉరవకొండ ఏడీఏ సత్యనారాయణ, ఏఓ రామకృష్ణుడు, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త మల్లికార్జున, పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన తదితరులు పాల్గొన్నారు.

## పూలచెర్లలో కోటి సంతకాల సేకరణ

**కణేకల్లు:** పేద, నిరుపేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేసేలా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కుట్ర చేస్తున్న కూటమి సర్కారుకు కోటి సంతకాల సేకరణతో కనువిప్పు కల్గిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ మండలంలోని పూలచెర్ల గ్రామంలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించింది. నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంతకాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, పూలచెర్ల సర్పంచు బీఎస్ పద్మావతి, గోపులాపురం సర్పంచు సూర్యదేవర ప్రకాష్‌చౌదరి, వైస్ సర్పంచు గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి, కె.హనుమంతప్ప, హంపీ, బోయ నాగరాజు, బోయ రవి, బషీర్, మహమ్మద్, రవి, మారెంపల్లి చంద్ర తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

## కృష్ణా జలాలు వృథా కాకుండా చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

**ఉరవకొండ:** కృష్ణా జలాలు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాగులపాడు ఎత్తిపోతల పథకంలో మోటార్లు పనిచేయకపోవడంతో అధికారులు ఛాయాపురం వద్ద ఉన్న ఎస్కేప్ ఛానల్ వద్ద గండికొట్టి నీటిని వృథాగా వదిలేయడాన్ని తప్పుపట్టారు. సాంకేతిక సమస్య తలెత్తినప్పుడల్లా కాలువలకు గండికొడితే కాలువగట్టు భద్రతకు ముప్పు కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎస్కేప్ ఛానల్‌కు గేట్లను అమర్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం నిద్రమత్తు వీడి వెంటనే రాగులపాడు వద్ద తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించి, ఎస్కేప్ ఛానల్‌వద్ద ఏర్పాటుచేసిన గండిని పూడ్చి నీటిని వృథా కాకుండా ఆపాలని కోరారు.



## పోటాపోటీగా వాలీబాల్ పోటీలు

**బెళుగుప్ప:** స్థానిక జెడ్పీహైస్కూల్‌లో శుక్రవారం స్కూల్ గేమ్స్ అండర్ –17 మండలస్థాయి వాలీబాల్ పోటీలను మండల స్పోర్ట్ కోఆర్డినేటర్ గోపాల్‌రెడ్డి, హెచ్ఎం వెంకటప్రసాద్ ప్రారంభించారు. బాల, బాలికల విభాగంలో నరసాపురం ఉన్నత పాఠశాల జట్టు మొదటి స్థానం, బెళుగుప్ప కేజీబీవీ ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో గుండ్లపల్లి, బెళుగుప్ప పాఠశాలలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలు ఈనెల 21న డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని స్పోర్ట్స్ మండల కోఆర్డినేటర్ పేర్కొన్నారు. విజేత జట్లను అభినందించి ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేరున రూ.7500 నగదును పూర్వవిద్యార్థి మల్లికార్జున అందజేశారు. పీడీలు రాఘవేంద్ర, మలోబన్న, గంగాదర్, పీఈటీ అనిత పాల్గొన్నారు.



విజేత జట్టును అభినందిస్తున్న నిర్వాహకులు

## జస్టిస్ గవాయిపై దాడి అప్రజాస్వామికం

**శెట్టూరు:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై దాడి అప్రజాస్వామిక చర్య అని, నిందితులను వెంటనే చట్టప్రకారం శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మారెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ ఈశ్వరమ్మకు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశులు, రామన్న జనార్దన్, శ్యామ్, మహంతేష్, అభిషేక్, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**బెళుగుప్ప:** సీజేఐ బీఆర్.గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, నాయకులు వన్నూరస్వామి, అంగడి శ్రీరాములు, శ్రీకాంత్, నారాయణస్వామి, సూర్యనారాయణ, వీరన్న, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



శెట్టూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## త్రుటిలో తప్పిన ప్రమాదం

**కళ్యాణదుర్గం:** కళ్యాణదుర్గం డిపో నుంచి వేపులపర్తి – పోలేపల్లి ఆర్టీసీ సర్వీసు బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో కళ్యాణదుర్గం డిపో నుంచి 70 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. పట్టణం దాటగానే ఓ తోట వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని తప్పించబోయి ఓ వైపు ఒరిగింది. దీంతో ప్రయాణికులు పెద్ద ఎత్తున హాహాకారాలు చేశారు. అయితే బస్సు బోల్తా పడకుండా.. ఒక వైపు ఒరగడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## మోరేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**కళ్యాణదుర్గం:** మండలంలోని మోరేపల్లిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులు తదితర వ్యాధులకు సంబంధించి సుమారు 32 మందికి పైగా చికిత్సలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి తిరుపాలయ్య, సూపర్‌వైజర్ సురేష్ బాబు, హెల్త్ అసిస్టెంట్లు వీరశేఖర్, నిర్మల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నత్తనడకన వ్యవసాయ గోదాముల నిర్మాణం

**కూడేరు:** కో–ఆపరేటివ్ బ్యాంక్ తరఫున నాబార్డు నిధులతో కూడేరులో జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం సమీపాన, అనంత వెంకటరెడ్డి కాలనీ వద్ద తలపెట్టిన వ్యవసాయ గోదాముల నిర్మాణపు పనులు నత్తనడకన సాగుతున్నాయి. సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద రూ.80 లక్షలతో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం, అనంత వెంకటరెడ్డి కాలనీ వద్ద రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో గోదాములు నిర్మిస్తున్నారు. కాంట్రాక్టర్లు తొందరగా నిర్మాణాలు పూర్తి చేసి గోదాములు తమకు స్వాధీన పరిస్తే ఫర్టిలైజర్స్ పెట్టి రైతులకు సొసైటీ తరఫున ఎరువులు విక్రయిస్తామని సొసైటీ సీఈఓ రామాంజనేయులు తెలిపారు.



అనంత వెంకటరెడ్డి కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న గోదాము

## మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రంజిత్‌కుమార్



**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా పి.రంజిత్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన డీఎస్సీ ప్రిన్సిపాల్ కోటాలో ఆయన ఎంపికయ్యారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తానని రంజిత్ పేర్కొన్నారు.

## గర్భకోశ వ్యాధులపై అప్రమత్తత అవసరం

**బొమ్మనహాళ్:** పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధులపై పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు ప్రేమ్ చంద్ర సూచించారు. మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని పశువైద్య శాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఈఓ వెంకటేష్, కణేకల్లు ఏడీ లక్ష్మీ శైలజ, శింగనమల ఏడీ పద్మనాభం, కళ్యాణదుర్గం ఏడీ వెంకటరమణ, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మన్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ కాదండోయ్ !



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

**కూడేరు:** ప్రజలకు ఉపన్యాసాలు చెబుతాం..కానీ తాము మాత్రం పాటించం అన్నట్లుగా ఉంది అధికారుల తీరు. ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛంధ్ర' పేరుతో అధికారులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ ర్యాలీ నిర్వహిస్తారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయిస్తారు. అయితే అవన్నీ ప్రజలకేనని, తమకు కాదన్నట్లుగా ఉంది అధికారులు తీరు. ఇందుకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణమే నిదర్శనం. కార్యాలయఆవరణమంతా పిచ్చి మొక్కలు పెరిగి నర్సరీని తలపిస్తోంది. అందులో నుంచి విషపురుగులు బయటకు వస్తున్నాయి. పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఆవరణలో నిలవలేక పోతున్నారు. దీనికి తోడు భవనం పక్కన లోపలికి వెళ్లే చోట చెత్తచెదారం పడేస్తారు. ఉన్నతాధికారులు రోజూ చూసుకుంటూ వెళుతున్నారే తప్పా తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

**కణేకల్లు:** స్థానిక జెడ్పీహైస్కూల్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. రెండ్రోజుల పాటు ఈ ఆట పోటీలు కొనసాగనున్నాయి. మండలంలోని 14 హైస్కూళ్లకు చెందిన బాల, బాలికలు వివిధ పోటీల్లో పాల్గొన్నారు.